సాక్షి
కాకినాడ
సోమవారం । 4 । మార్చి । 2024



రూ.50,116 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు లక్కింశెట్టి వెంకటేశ్వరరావు (తాటిపాక) ఆదివారం రూ.50,116 విరాళం సమర్పించారు.



రూ.1,00,116 సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు కటికిరెడ్డి సుబ్బారాయుడు, రాజరాజేశ్వరి దంపతులు (టేకిశెట్టిపాలెం) ఆదివారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.55 అడుగులుగా నమోదైంది.

చప్పన దప్పిక తీరేలా..

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- రూ.14.68 లక్షలతో బోర్లు, చేతిపంపులు, పైపులైన్లకు మరమ్మతులు
- ఇప్పటికే 90 శాతం చెరువుల్లో పూర్తి స్థాయిలో తాగునీరు




కొత్తపల్లి మండలం వాకతిప్ప మంచినీటి పథకం చెరువులో నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఈ ఏడాది వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందంటూ ఇప్పటికే రాష్ట్ర విపత్తుల శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. వేసవిలో గొంతెండిపోకుండా.. ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. వాస్తవానికి గ్రామీణ, పట్టణ తాగునీటి సరఫరాను మెరుగుపరచడంపై ప్రభుత్వం చాలా కాలం నుంచే దృష్టి సారించింది. దీంతో ఎప్పటికప్పుడు చాలా వరకూ పనులు పూర్తి చేస్తున్నారు. ఫలితంగా ఈసారి వేసవిలో జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరా పనులకు అతి తక్కువగా కేవలం రూ.14.68 లక్షలు మాత్రమే వ్యయం కానుంది.

చర్యలు తీసుకున్నారిలా..

సాధారణంగా వేసవిలో అత్యధికంగా మెట్ట ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తుతూంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికే చాలా వరకూ తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నీటిని నింపారు. వాటికి అనుబంధంగా ఆయా గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరచి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కాకినాడ రూరల్, పెదపూడి మండలాల్లో చెరొక చెరువును, తాళ్లరేవు మండలంలో రెండు మేజర్ మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో తాగునీటితో నింపేందుకు చర్యలు చేపట్టారు. ఈ చెరువుల్లో తాగునీరు నింపేందుకు రూ.8.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అలాగే, తాగునీరు సరఫరా చేసే పైపులైన్లకు అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టనున్నారు. మూతపడిన నీటి పరిశుద్ధ (ఆర్‌ఓ) ప్లాంట్లను తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాటి ద్వారా కూడా తాగునీరు అందించాలని నిర్ణయించారు. జిల్లాలో



50 బోర్లు పాడయ్యాయని గుర్తించారు. స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టనున్నారు. దీనికి రూ.6.18 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మంచినీటి వనరులను వేసవిలో పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేలా కసరత్తు చేస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరులు, జిల్లా పరిషత్, మున్సిపల్, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో తాగునీటికి ఎటువంటి సమస్యా తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నారు.

మండల స్థాయిలో కమిటీలు

గ్రామాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి మండలంలో ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు, ఈఓ పీఆర్‌డీతో ఈ కమిటీ ఏర్పాటు కానుంది. ఆయా కమిటీలు ప్రతి వారం మండల స్థాయిలో సమావేశమై, ఆ మండలంలోని ఏయే గ్రామాల్లో మంచినీటికి ఇబ్బంది ఉందో, దానిని ఏవిధంగా పరిష్కరించాలో అక్కడికక్కడే నిర్ణయిస్తారు. సమస్యను పరిష్కరించి, ప్రజలకు మంచినీరు సక్రమంగా అందేలా ఏర్పాట్లు చేస్తారు.



జిల్లా స్థాయిలో మానిటరింగ్ సెల్



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనల నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 90 శాతం చెరువులను నీటితో నింపాం. ఈ నెల 15 లోగా ఆయా చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో మంచినీటి కొరతకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నాం.

– ఎం.శ్రీనివాస్, ఎస్ఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, కాకినాడ జిల్లా

మహిళా సిబ్బందికి ప్రభుత్వ కానుక

- నేటి నుంచి జీజీహెచ్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్
- ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు

కాకినాడ క్రైం: ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ జీజీహెచ్, రంగరాయ వైద్య కళాశాలల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమూల్య కానుక అందించింది. రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ అనే భేదం లేకుండా ఉద్యోగం స్థాయి, హోదా వంటి తారతమ్యాలు చూడకుండా ప్రతి మహిళా ఉద్యోగికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి గురువారం వరకూ నాలుగు రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. పాథాలజీ, రేడియాలజీ, గైనకాలజీ, ఆంకాలజీ, ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణుల ఆధ్వర్యాన జరగనున్న ఈ స్క్రీనింగ్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ గైనకాలజీ ఓపీ రూమ్ నంబర్ 11లో జరగనుంది. స్క్రీనింగ్ చేయించుకునే ప్రతి మహిళా సిబ్బంది రేడియేషన్ ఆంకాలజీ ఓపీలో తమ పేరు నమోదు చేసుకొని స్లిప్ పొందాలి. అక్కడి నుంచి నేరుగా 11వ నంబర్ ఓపీ గదికి వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. మహిళలకు ప్రాణసంకటంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్, పాప్‌స్మియర్), బ్రెస్ట్ క్యాన్సర్ (క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్), ఓరల్ కావిటీ క్యాన్సర్(ఓరల్ విజువల్ ఇన్‌స్పెక్షన్)ల నిర్ధారణ కోసమే ప్రత్యేకంగా ఈ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు. అలాగే, వివిధ క్యాన్సర్లపై అవగాహన కల్పించేందుకు ఎస్‌పీఎం లెక్చర్ గ్యాలరీలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకూ జరిగే ఈ అవగాహన కార్యక్రమంలో ఆయా క్యాన్సర్ల వ్యాప్తి, నివారణ, చికిత్స తదితర అంశాలపై రేడియేషన్ ఆంకాలజీ నిపుణులు అవగాహన కల్పిస్తారు.

న్యూస్‌రీల్

లోవకు భక్తుల తాకిడి



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారిని ఆదివారం 5 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు, పూజా టికెట్లు, వసతి గదుల అద్దెల రూపంలో అమ్మవారికి రూ.2,47,949 ఆదాయం సమకూరిందని వివరించారు.

తొలి పూజ నీకే గణపయ్యా..



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తజనం

అయినవిల్లి: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం చేశారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 35 మంది, ప్రత్యేక దర్శనంలో 464 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 16 మంది పాల్గొని పూజలు ఆచరించారు. 15 మంది వాహన పూజ, 19 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. స్వామివారికి నలుగురు తలనీలాలు సమర్పించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,50,305 ఆదాయం సమకూరిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాలాజీ స్వామీ.. సదా స్మరామి

కిక్కిరిసిన అప్పనపల్లి క్షేత్రం



ఆలయం వద్ద హోమం చేస్తున్న పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. శ్రీలక్ష్మీ నారాయణ హోమాన్ని వేద పండితులు వైభవంగా చేశారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.1.50 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.05 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.45,188 విరాళాలు వచ్చాయి. 3,085 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 1,902 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆకుల శ్రీనివాస చక్రవర్తి రూ.లక్ష విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. దాతకు వారు స్వామివారి చిత్రపటం అందజేశారు.

పల్స్‌పోలియో విజయవంతం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాయక్

- 98.06 శాతం పిల్లలకు చుక్కల మందు
- మిగిలిన వారికి నేడు, రేపు అందజేత

కాకినాడ క్రైం: జిల్లాలో ఆదివారం నిర్వహించిన జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. నగరంలోని ప్రతాప్ నగర్ పీహెచ్‌సీలో కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటరావు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ నరసింహ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 1,94,332 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1,375 బూత్‌లు ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకూ కొనసాగిందన్నారు. సాయంత్రం నాటికి 98.06 శాతం మంది పిల్లలకు చుక్కల మందు పంపిణీ పూర్తయిందని అన్నారు. మిగిలిన చిన్నారులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు కలసి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి ఈ మందు వేస్తారని తెలిపారు. అనంతరం నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని డాక్టర్ నాయక్ తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ కె.రత్నకుమార్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తొండంగి మండలం పెరుమాళ్లపురం పంచాయతీ కొత్తచోడిపల్లిపేటకు చెందిన టీడీపీ నాయకులు అడవయ్య, నాగేంద్ర ఆధ్వర్యంలో 80 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. సీఎం జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నట్లు వారు చెప్పారు.

ఘనంగా సత్యదేవుని రథోత్సవం



రథంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు

అన్నవరం: రత్నగిరిపై ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. అనంతరం ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను వేంచేయించి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. తరువాత వేదపండితుల మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా, ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం పండితులు మళ్లీ పూజలు నిర్వహించగా, ఈఓ కె.రామచంద్ర మోహన్ పాల్గొన్నారు. రథోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లను మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకువెళ్లారు.

పశ్చిమ రాజగోపురం వద్ద రథం షెడ్డు

కాగా, పశ్చిమ రాజగోపురం లోపలి భాగంలో ప్రస్తుతం రూ.300 దర్శనం టిక్కెట్లు విక్రయిస్తున్న కౌంటర్ వద్ద రథానికి షెడ్డు వేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఈఓ కార్యాలయం వద్ద స్వామివారి ఊరేగింపు వాహనాలకు షెడ్డు వేసినట్టుగా ఇక్కడ కూడా అన్‌బ్రేకబుల్ గ్లాస్, డోర్లతో షెడ్డు వేయాలని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం – జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కోరారు.

టీడీపీ, జనసేన, బీజేపీకి బై..





వైఎస్సార్ సీపీలో చేరిన స్వామి నగర్ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ఫిషింగ్ హార్బర్ పేట మత్స్యకారులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- వైఎస్సార్ సీపీకి జై
- పార్టీలో 300 మంది చేరిక

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఆకర్షితులైన 300 మంది టీడీపీ, జనసేన, బీజేపీలకు బై చెప్పి, వైఎస్సార్ సీపీకి జై కొట్టారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని స్వామినగర్‌కు చెందిన సుమారు 200 మంది కోరాడ దుర్గాప్రసాద్‌రెడ్డి, కరాటే రాము, సత్తిబాబు, రమణ ఆధ్వర్యాన వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో స్వామినగర్ నుంచి శంకరరావు, శేషు, శ్రీనివాస్, రాజు, సింహాద్రి, నాని, సిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ తదితరులు ఉన్నారు.

అలాగే, వాకలపూడి ఫిషింగ్ హార్బర్ పేట నుంచి సుమారు 100 మంది మత్స్యకార యువకులు బసవా ప్రసాద్ కుమార్, స్వామి, ఫ్రాన్సిస్, ఆది తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట వైద్య నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం పరిపాలన, సంక్షేమం అందిస్తున్న తీరుకు ఆకర్షితులైన పలువురు టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో కలసి పని చేద్దామని అన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. పేదలకు శాశ్వతంగా మేలు చేసేలా ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించడం, పిల్లలకు ఇంగ్లిషు మీడియం.. ఇలా ఇన్ని వినూత్న పథకాలు దేశంలోనే ఎక్కడా అమలు జరగలేదని చెప్పారు. ఇటువంటి పథకాలు అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌కు త్వరలో జరిగే ఎన్నికల్లో అందరం అండగా ఉంటాలని కన్నబాబు కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో..

కాకినాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీని నట్టేట ముంచారని నిరసిస్తూ సుమారు 300 మంది యువత ఆదివారం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎన్నో ఆకాంక్షలతో పార్టీ కోసం పని చేసిన తమకు పవన్ కల్యాణ్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం, టీడీపీతో జత కట్టిన విధానం తీవ్ర క్షోభకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పని చేసేందుకు ఆసక్తి చూపిస్తూ.. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, స్థానిక నాయకులు ఫిలిప్స్ సారథ్యాన మందపాటి సతీష్, మందపాటి వినయ్, కూరాకుల పండు ఆధ్వర్యంలో వీరందరూ ర్యాలీగా తరలివచ్చి, జగన్నాథపురంలోని ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టించి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ తల్లి

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా దేవస్థానానికి రూ.1,28,141 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.



క్లుప్తంగా

ఏఎన్‌ఎం అదృశ్యంపై కేసు



కనకదుర్గ వెంకటలక్ష్మి (ఫైల్)

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట సచివాలయ ఏఎన్‌ఎం అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. సిద్ధ కనకదుర్గ వెంకటలక్ష్మి (అక్కీ) నీలాద్రిరావుపేటలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తుంది. ఆమెకు వివాహం అయ్యి భర్త, కుమారుడు మరణించారు. శనివారం మధ్యాహ్నం ఆమె ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి సిద్ధా రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94409 04841, 08852 294100 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్సై శ్రీనివాస్


ఆత్రేయపురం: ర్యాలి గ్రామానికి చెందిన మద్దుల వెంకటేశ్వరరావు షాపు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 743 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.14,870 ఉంటుందని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా రేషన్ బియ్యాన్ని గుర్తించి, రెవెన్యూ సిబ్బందికి అప్పగించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నిడదవోలు : స్థానిక చిన కాశిరేవు సమీపంలో ఆదివారం గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో సుమారు 70 ఏళ్ల వయస్సు గల తెలుపు రంగు ఛాయలో ఉండి, గుండు చేయించుకుని ఉన్న వృద్ధురాలు మృతి చెందింది. మృతురాలు నీలం రంగు చీర, గోల్డ్ కలర్ అంచు జాకెట్ ధరించింది. ఆమె ముక్కుకు లిక్విడ్ పైప్ ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీ హరిబాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9490617090 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పరీక్షకు వేళాయె

- ఓపెన్ స్కూల్ ఎగ్జామ్స్‌కు చురుగ్గా ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాలు
- హాజరు కానున్న 22,260 మంది విద్యార్థులు
- ఈ నెల 18 నుంచి నిర్వహణకు చర్యలు



ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన అభ్యర్థులు

రాయవరం: చదువుకోవాలనే తపన ఉంటే వయసుతో పనేముంది.. అలాంటి వారికి ఇదో చక్కని అవకాశం.. ఆర్థిక, కుటుంబ పరంగా ఇబ్బందులు, మరే ఇతర కారణాలతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టిన అభ్యర్థులకు సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) ఓ వరం.. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు పరీక్షా కాలం దగ్గర పడింది.. రెగ్యులర్ 'పది' పరీక్షలతో పాటు ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. వీరికి ఏప్రిల్ 18 తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా టైమ్ టేబుల్‌ను విడుదల చేసింది.

ఉమ్మడి జిల్లాలో 237 స్టడీ సెంటర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక విద్యకు 237 స్టడీ సెంటర్లు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 72, కాకినాడ జిల్లాలో 94, తూర్పుగోదావరి జిల్లాలో 71 స్టడీ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులకు ప్రతి ఆదివారం, రెండో శనివారం షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించి, స్టడీ మెటీరియల్‌ను అందజేసి పరీక్షలకు సన్నద్ధం చేశారు. ఈ విద్యా పీఠం ద్వారా ఇంటర్‌లో సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ కోర్సులు ఉన్నాయి.

ఎంత మంది.. ఎన్ని కేంద్రాలు

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు గతేడాది ఆగస్టులో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా 17,778 మంది దరఖాస్తు చేసుకున్నారు. పదో తరగతి ప్రవేశ పరీక్షకు 4,916 మంది, ఇంటర్ కోర్సులో ప్రవేశానికి 12,862 మంది ఉన్నారు. వీరితో పాటు గతంలో పరీక్షలు రాసి, ఉత్తీర్ణత కాని వారూ ఇప్పుడు పరీక్షలు రాయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,994 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 16,266 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇంటర్ పరీక్షలకు 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ తర్వాత హాల్ టిక్కెట్లు విడుదల చేసి, ఏపీ సార్వత్రిక విద్యా పీఠం వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	పది విద్యార్థులు	ఇంటర్ విద్యార్థులు
కోనసీమ	22 (5+17)	1,312	5,263
కాకినాడ	27 (7+20)	2,067	6,494
తూర్పు	26 (10+16)	2,615	4,509
మొత్తం	75 (22+53)	5,994	16,266

పరీక్షల టైమ్ టేబుల్ ఇదీ

తేదీ	10వ తరగతి	ఇంటర్
మార్చి 18	తెలుగు, ఉర్దూ, కన్నడం, ఒరియా, తమిళం	హిందీ, తెలుగు, ఉర్దూ
మార్చి 19	హిందీ	జీవశాస్త్రం, వాణిజ్య/ వ్యాపార శాస్త్రం, గృహవిజ్ఞాన శాస్త్రం
మార్చి 20	ఇంగ్లిష్	ఇంగ్లిష్
మార్చి 22	గణితం, భారతీయ సంస్కృతి మరియు వారసత్వం	గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం
మార్చి 23	శాస్త్ర మరియు సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం	ఫిజిక్స్, సివిక్స్, మనో విజ్ఞాన శాస్త్రం
మార్చి 26	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	కెమిస్ట్రీ, ఎకానమిక్స్, సామాజిక శాస్త్రం
మార్చి 27	బిజినెస్ స్టడీస్, మనో విజ్ఞానశాస్త్రం	-----

5 తర్వాత హాల్ టిక్కెట్ల జారీ



ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల 5వ తేదీ తర్వాత స్టడీ సెంటర్ల ద్వారా పరీక్షలకు హాల్ టికెట్లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుర్తించిన పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాం. పరీక్ష పేపర్లు ఈ నెల 14న జిల్లా కేంద్రానికి చేరుకోనున్నాయి.

–పి.సాయివెంకట రమణ, జిల్లా కన్వీనర్, ఏపీ ఓపెన్ స్కూల్, అమలాపురం

ఎటువంటి లోటుపాట్లూ లేకుండా..



ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. ఇప్పటికే సీఎస్, డీవోల నియామకాలను జరిపాం. సీఎస్, డీవోలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్నాం. ఎటువంటి లోటుపాట్లకు తావులేని విధంగా పరీక్షలు నిర్వహించాలని డీఈఓలకు ఆదేశాలిచ్చాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

నేటి నుంచి 'పది' హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్

రాయవరం: పదో తరగతి హాల్ టిక్కెట్లు సోమవారం విడుదల కానున్నాయి. ఈ నెల 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పరీక్షల విభాగం హాల్ టిక్కెట్లు విడుదల చేయనుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 70 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ విద్యార్థులందరికీ ప్రభుత్వ పరీక్షల విభాగం హాల్ టిక్కెట్లను మధ్యాహ్నం 12 గంటల నుంచి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా పాఠశాల హెచ్ఎంలు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టిక్కెట్లను సంబంధిత హెచ్ఎంలు పరీక్షలకు ముందుగా విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యార్థులు కూడా నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు హాల్ టిక్కెట్లు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నక్కా సురేష్ తెలిపారు.

కృషి, పట్టుదలతో లక్ష్య సాధన



క్రీడోత్సవ్‌లో పాల్గొన్న ఈషా సింగ్, లెఫ్టినెంట్ కమాండర్ స్వాతి, సినీ నటుడు సాయికుమార్

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలంటే కృషి, పట్టుదలతోపాటు సరైన సాధన అవసరమని భారత షూటర్, అర్జున్ అవార్డు గ్రహీత ఈషా సింగ్ అన్నారు. దివాన్‌చెరువులోని షిరిడీ సాయి విద్యా ప్రాంగణంలో నిర్వహించిన «క్రీడోత్సవ్» కార్యక్రమానికి నారీశక్తి పురస్కార గ్రహీత, లెఫ్టినెంట్ కమాండర్ (నౌకాదళం) పి.స్వాతి, సినీ నటుడు సాయికుమార్‌తో పాటు ఈషా సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మార్చ్ ఫాస్ట్, డ్రిల్ చూస్తున్నప్పుడు బాల్యం గుర్తుకు వచ్చిందని సాయికుమార్ అన్నారు. విద్యార్థులకు విద్యా బోధనతోపాటు వారిలో అంతర్లీనంగా ఉండే నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. షిరిడీ సాయి విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ సిసిమిక్ సర్వే జరగనివ్వం

- రాజకీయాలకు అతీతంగా ఉద్యమం
- న్యాయం జరిగే వరకూ పోరాటం
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: మత్స్యకారులకు న్యాయం చేయకుండా ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం సముద్ర గర్భంలో ప్రతిపాదించిన సిసిమిక్ సర్వేను జరగనివ్వమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. యాంకరేజ్ పోర్ట్ ప్రాంతంలో ఓఎన్జీసీ పనులను అడ్డగించి మత్స్యకారులు నిరసన తెలుపుతున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం ఓఎన్జీసీ సంస్థ తాజాగా సముద్ర గర్భంలో సిసిమిక్ సర్వే చేపట్టిందన్నారు. సర్వే జరిగే సమయంలో కాకినాడకు మూడు దిక్కులా 500 చదరపు కిలోమీటర్ల పరిధిలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా నియంత్రించాలని ఇప్పటికే ఓఎన్జీసీ సంస్థ మత్స్య శాఖకు లేఖ కూడా రాసిందన్నారు. ఈ అంశాన్ని మత్స్య శాఖ గోప్యంగా ఉంచిందన్నారు. సర్వేలు చేసుకోవడం, ఆయిల్ గ్యాస్ నిక్షేపాలను వెలికి తీయడంలో తమకు అభ్యంతరం లేదని, వీటివల్ల చేపల వేటే జీవనాధారంగా బతికే మత్స్యకారుల పొట్ట కొట్టవద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. సర్వే జరిగే ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకపోతే వారి జీవనాధారం ఏంటని ద్వారంపూడి ప్రశ్నించారు. సముద్ర గర్భంలో నిక్షేపాల ద్వారా ప్రస్తుతం రూ.65 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశమున్నట్లు సమాచారం ఉందని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. అటువంటప్పుడు మత్స్యకారులకు సుమారు రూ.200 నుంచి రూ.250 కోట్ల పరిహారం ఇచ్చే విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ఆయన నిలదీశారు. కేజీ బేసిన్‌లో వెలికి తీసిన సుమారు రూ. లక్షా 65 వేల కోట్ల విలువచేసే నిక్షేపాల తొలి షిప్‌ను ఇటీవల ఇక్కడి నుంచి తరలించారన్నారు. ఇంతటి సంపద ఈ ప్రాంతంలో బయటపడటం ఎంతో అదృష్టమని, అదే సమయంలో ఈ ప్రాంత మత్స్యకారులకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయాలకు అతీతంగా...

ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా చేద్దామని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలిసి వచ్చే పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని ఏ ఒక్కరూ నీరుగార్చవద్దని సూచించారు. ఐక్యతతో ముందుకు సాగి గతంలో జరిగిన అన్యాయం పునరావృతం కాకుండా సమష్టిగా పనిచేయాలని ఆయన మత్స్యకారులకు పిలుపునిచ్చారు. శాంతియుతంగా సమస్య పరిష్కారమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. సమస్యపై ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పొన్నాడ సతీష్‌కుమార్‌తో కూడా చర్చించామని, అంతా సానుకూలంగా ఉన్నారన్నారు.

నేడు బైక్ ర్యాలీ

ఓఎన్జీసీ పరిహారం కోసం సోమవారం ఉదయం 9 గంటలకు ఎంఎస్ఎన్ చారిటీస్ నుంచి ఓఎన్జీసీ వరకూ ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలను కూడా కలిసి చర్చిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార ప్రతినిధి కాటాడి జానికిరామ్, పంతాడి బ్రహ్మానందం, వాసుపల్లి కృష్ణ, చక్రవర్తి, ఏటిమొగ, ఇతర మత్స్యకార పెద్దలు ఉన్నారు.

కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు



అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బోట్‌క్లబ్ (కాకినాడ): వంగూరి ఫౌండేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. మూడు దశాబ్దాలుగా అమెరికాలో అనేక సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సదస్సు జరుగనుంది. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను స్థానిక దంటు కళాక్షేత్రంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో తొలిసారిగా కాకినాడలో అఖిలభారత తెలుగు సాహితీ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధప్రసాద్ హాజరవుతారన్నారు. సంస్థ సభ్యురాలు శైలజ మాట్లాడుతూ ప్రఖ్యాత సాహితీవేత్తలు పాల్గొనే ఈ సదస్సుకు సాహితీవేత్తలు, భాషాభిమానులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సదస్సు నిర్వాహక సభ్యులు మార్ని జానకిరామ చౌదరి, సభ్యులు కొరుప్రోలు గౌరీనాయుడు, జోస్యుల కృష్ణబాబు, వైఎస్ఎన్ మూర్తి, సుచిత్రామూర్తి, ప్రకాష్, చింతపల్లి సుబ్బారావు, సాయి సత్యనారాయణ, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ టాపర్ అనిరుధ్

రంగరాయ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో ఖ్యాతి



యూనివర్సిటీ టాపర్ అనిరుధ్‌ను సత్కరిస్తున్న డీఎంఈ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ విఠల్

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాల కీర్తి పతాకం రాష్ట్ర స్థాయిలో రెపరెపలాడింది. ఆర్ఎంసీలో ఫైనల్ ఇయర్ చదివిన ఎ.సాయి అనిరుధ్ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ స్థాయిలో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఇదే కళాశాలకు చెందిన పార్వతి మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆదివారం స్థానిక లెక్చర్ గ్యాలరీలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ స్థాయిలో టాపర్‌గా నిలిచిన అనిరుధ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మాట్లాడుతూ అనిరుధ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. థర్డ్ ర్యాంకర్ పార్వతితో పాటు డిస్టింక్షన్‌లో నిలిచిన విద్యార్థులు శ్రీలత, రాఘవేంద్రలకు అభినందనలు తెలిపి విద్యార్థులంతా వీరి కృషిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రంగరాయ వైద్య కళాశాల 99 శాతం ఉత్తీర్ణతను సాధించడం అసామాన్య విషయమని కీర్తిస్తూ అందుకు కృషి చేసిన బోధనా సిబ్బందిని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాళ్లుగా డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవిల దక్షతను అభినందించారు. అనంతరం సామాజిక వేత్త స్వర్ణభారతి ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సీడ్స్) వ్యవస్థాపకుడు గోకాడ రాంబాబు ర్యాంకర్లకు మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ సహా వివిధ డిపార్టుమెంట్ల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్‌లు, అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

భక్తితో కొలిస్తేనే భగవంతుని కటాక్షం



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అన్ని శుభాలు పరమేశ్వరుని పాదాల చెంతనే ఉంటాయని శారద జ్ఞానపుత్ర, ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి రాజమహేంద్రవరంలోని డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం మైదానంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి బాలమురళీకృష్ణ, విజయ రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తిసుధా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు భక్తులకు పరమేశ్వరుని గురించి అనుగ్రహ భాషణం చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన గోదావరి తీరంలో ప్రవచనం చెప్పడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. పరమశివునికి చెంబుడు నీళ్లు పోస్తే ప్రసన్నం అవుతాడన్నారు. భక్త కన్నప్ప పరమ శివునికి భక్తితో మాంసం పెట్టినా స్వీకరించారని, కాలితో శివలింగాన్ని తన్నినా పరవశించాడన్నారు. రాతిని బొమ్మ అంటే.. బొమ్మగానే కనబడుతుందన్నారు. అదే రాతిని అమ్మవారిగా అనుకుంటే అమ్మవారు కటాక్షిస్తారన్నారు. గుండెల నిండా భక్తి ఉంటే ఏరకంగా కొలిచినా భగవంతుడు ప్రత్యక్షమవుతాడని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీ భరత్ రామ్, పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావును సత్కరించారు.

టెక్నాలజీలో ముందంజలో ఉండాలి

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం



జీఎం భారతీరెడ్డిని సత్కరిస్తున్న సొసైటీ చైర్మన్ రాజేంద్రప్రసాద్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు ముందంజలో ఉండాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం భారతీరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని మాతా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్పీఎల్ కార్యక్రమం ద్వారా టీవీ టెక్నీషియన్లకు రెండు రోజుల అప్‌స్కిల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం భారతీరెడ్డి హాజరయ్యారు. టీవీ టెక్నీషియన్లు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్‌ని ప్రోత్సహించేలా, శిక్షణ అనంతరం ఉపాధి పొందడానికి వీలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. టీవీ టెక్నీషియన్లుగా స్థిరపడిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటే, సర్టిఫికెట్ అందిస్తామన్నారు. రోజుకో మోడల్ టీవీలు మార్కెట్లో వస్తున్న నేపథ్యంలో వాటికి మరమ్మతులు చేయాలంటే ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీ ఫౌండర్, చైర్మన్ శింకా రాజేంద్రప్రసాద్ ఆమెను శాలువాతో సత్కరించారు. జిల్లా ఏబీఎస్‌ఓ పెరుమల్లు, మేనేజర్ గోపీచంద్ పాల్గొన్నారు.

రచనకు కవిత్వం జీవ లక్షణం

పచన కవితలు గ్రంథావిష్కరణ చేసిన శ్యామలానంద ప్రసాద్



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీ ప్రముఖులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సాహితీ ప్రక్రియ ఏదైనా, ఉత్తమ రచనకు కవిత్వం జీవ లక్షణం కావాలని సంస్కృతాంధ్ర శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. ఓఎన్జీసీ విశ్రాంత డీజీఎం, కవి, కథకుడు కవితా ప్రసాద్ విరచిత పచన కవితలు గ్రంథావిష్కరణ సభ స్థానిక గౌతమీ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. కళాగౌతమి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి జోరా శర్మ సభ సంచాలకత్వం వహించారు. గ్రంథాన్ని డాక్టర్ శ్యామలానంద ప్రసాద్ ఆవిష్కరిస్తూ, పొట్టు ఏదైనా అందులో గింజ ఉండడం ఎంత ప్రధానమో, కవితా ప్రక్రియల్లో కవిత్వం ప్రధానమన్నారు. గింజ ప్రధానమని, పొట్టు దానికి రక్షణ కల్పిస్తుందని, కేవలం పొట్టు ఒక్కటే ఉంటే అది ఊకదంపుడు అవుతుందని విశ్లేషించారు. డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ నిఘంటువులో దొరకని పదాలను తన కవితల్లో ప్రస్తావిస్తారని, అవి కూడా అర్థవంతంగా ఉంటాయన్నారు. సాహితీవేత్త వారణాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అటు సంప్రదాయ పద్య రచనలోను, ఇటు ఆధునిక, సాహితీ ప్రక్రియల్లో సవ్యసాచి కవితా ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రముఖులు డాక్టర్ అద్దేపల్లి సుగుణ, కర్రా కార్తికేయశర్మ, సప్పా దుర్గాప్రసాద్, డాక్టర్ అరిపిరాల నారాయణరావు, బీహెచ్‌వీ రమాదేవి, డాక్టర్ పీవీబీ సంజీవరావు, ప్రదీప్, మల్లెమొగ్గల గోపాలరావు, అడబాల మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన దగా చేసింది: పాటంశెట్టి సూర్యచంద్ర

జగ్గంపేట: ఐదేళ్లుగా జనసేన ఆశయాలకు కట్టుబడి పనిచేస్తే టిక్కెట్లు ఇచ్చే విషయంలో ఆ పార్టీ దగా చేసిందని, అందుకే వచ్చే ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. జగ్గంపేట నియోజకవర్గ జనసేన నేతగా పనిచేసిన సూర్యచంద్ర మండలంలోని రాజపూడిలో ఓ సమావేశంలో మాట్లాడారు. జనసేన, టీడీపీ పొత్తు నేపథ్యంలో తనకు టిక్కెట్ ఇవ్వకపోయినా బాధపడలేదన్నారు. కనీసం తనను ఒక నాయకుడిగా గుర్తించకపోవడంపై మనస్తాపం చెందానని అన్నారు. ఆరు రోజుల ఆమరణ దీక్ష చేసినా జనసేన, టీడీపీల నుంచి ఏ ఒక్కరూ వచ్చి మాట్లాడలేదన్నారు. అందుకే వారితో కలసి ప్రయాణం చేయలేక స్వతంత్రంగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు చెప్పారు.